క్లుప్తంగా

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: సోమవారం మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు ఎస్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు సమస్యలపై అర్జీలు పెట్టుకోవచ్చని ఆయన కోరారు.

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయితీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు. అలానే మండల తహశీల్దార్ కార్యాలయంలో అన్నీ గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలోని సచివాలయాల వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. సమావేశానికి హాజరయ్యే రెవెన్యూ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలని తహశీల్దార్ సూచించారు.

నేడు పాఠశాలలు పునః ప్రారంభం

కారంచేడు: సంక్రాంతి సెలవులను ముగించుకొని సోమవారం ప్రభుత్వం, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలను పునః ప్రారంభించాలని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లులు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రభుత్వం ఈ నెల 18వ తేదీన పాఠశాలలను పునఃప్రారంభించాలని ఆదేశించారు. అయితే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కోరిక మేరకు మరో రెండు రోజులు 19, 20 తేదీలను కూడా సెలవు దినాలుగా ప్రకటించారు. 21 ఆదివారం సెలవు కావడంతో సోమవారం పునః ప్రారంభించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

రేపు మండల సమావేశం

బల్లికురవ: బల్లికురవ మండలం సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్యా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరిగే సమావేశంలో వ్యవసాయం, విద్యుత్, విద్య, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం, గృహ నిర్మాణాలపై సమీక్షిస్తామన్నారు. సభ్యులు, మండలస్థాయి అధికారులు సర్పంచ్‌లు సకాంలో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

వైదనలో రేపు జేఏఎస్ క్యాంపు

బల్లికురవ: మండలంలోని వైదనలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో చికిత్స తీసుకున్న రోగులు కేస్‌షీట్‌లతో హాజరు కావాలన్నారు. కొత్తవారు శిబిరానికి రావచ్చని పరీక్షలతో పాటు, మందులు అందజేస్తామని వైద్యాధికారి వివరించారు.

ఎన్‌బీపాడులో భావనారుషి వేడుకలు

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో భద్రావతీ సమేత భావనారుషి వార్షిక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. వార్షికోత్సవంలో భద్రావతీ, భావనారుషి, ఆలయంలో లేనందున ప్రత్యేకంగా మండపం ఏర్పాటుతో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేపట్టారు. వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి వేషధారణ, గ్రామోత్సవం చేపట్టారు. ఆదివారం అన్నదానం నిర్వహించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

అద్దంకి రూరల్: రిక్షా కార్మికుల సమస్యల పరిష్కరానికి కృషిచేస్తానని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అద్దంకి రిక్షా యూనియన్ ప్రెసిడెంట్ చిలకా యేసన్న ఆధ్వర్యంలో కార్మికులు హనిమిరెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. రిక్షా కార్మికులను ఆదుకుంటానన్నారు.

గవర్నర్‌కు లా పుస్తకం అందజేసిన విద్యార్థి



గవర్నర్‌కు లా పుస్తకాన్ని అందజేస్తున్న సుఖేష్

అద్దంకి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ విదేశీ విద్యా దీవెన పథకం కింద అమెరికాలో విస్కాన్సిన్ యూనివర్సిటీ ఆఫ్ లా కళాశాలలో ఎల్ఎల్ఎం పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న అద్దంకి కాకానిపాలెంకు చెందిన విద్యార్థి సందిరెడ్డి సుఖేష్ ఆదివారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్, సుప్రీం కోర్టు రిటైర్డు న్యాయమూర్తి అబ్దుల్ నజీర్‌కు విస్కాన్సిన్ లా పుస్తకాన్ని, గవర్నర్ ప్యాలెస్ నమూనాను అందజేశారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి



మసీదు సెంటర్‌లో డ్రైన్, రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్

- ఎమ్మెల్యే కరణం, నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్

చీరాల: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదేశించారు. ఆదివారం మున్సిపాలిటీలోని మసీదు సెంటర్‌లో నిర్మాణం చేస్తున్న డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు ఇచఅచరు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మసీదు సెంటర్ చీరాల పట్టణానికి వచ్చే ప్రధాన రహదారి అని గతంలో జరిగిన తప్పులు మరలా జగరకుండా ఉండేందుకే శాశ్వత పరిష్కారం చేసేలా దృఢమైన కల్వర్టు, పెద్ద డ్రైనేజీ కాలువ నిర్మాణాలు చేయిస్తున్నామన్నారు. అధికారులు త్వరగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ డీఈ ఐసయ్య, పలువురు నాయకులు ఉన్నారు.



వేటపాలెంలో చెక్కు అందిస్తున్న వెంకటేష్

సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధితులకు ఆర్థిక తోడ్పాటు..

చీరాల టౌన్: ఆపత్కాల సమయంలో ప్రాణాపాయం నుంచి కాపాడేందుకు అప్పులు చేసిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి విముక్తులను చేస్తుందని ఎమ్మెల్యే కరణం, సమన్వయకర్త వెంకటేష్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీలోని సాయి ప్యాలెస్ రోడ్డులో నివాసం ఉంటున్న షేక్ ఫాతిమాకు రూ.5.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితురాలికి ఎమ్మెల్యే, వెంకటేష్‌లు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలు, ఆపన్నహస్తం కోసం ఎదురు చూసే బాధితులను ఆదుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. సీఎం సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంకాళరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వేటపాలెం: పాపాయిపాలెం గ్రామానికి చెందిన చప్పిడి శ్రీదేవికి రూ. 1.70 లక్షల సీఎం రిలీఫ్ పండ్ చెక్కును వెంకటేష్ అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనిమిరెడ్డి గెలుపు కోసం కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భద్రారెడ్డి

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అద్దంకి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి అన్నారు. ఆదివారం కొరిశపాడులో, అద్దంకిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై నమ్మకంతో హనిమిరెడ్డిని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమన్వయకర్తగా నియమించారన్నారన్నారు. ప్రతి గ్రామంలో చిన్నచిన్న సమస్యలకు దృష్టిలో పెట్టుకోకుండా హనిమిరెడ్డి గెలుపే ధ్యేయంగా పని చేసి సీఎంకు బహుమతిగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, కొరిశపాడు మండల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో సమన్వయకర్త హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనపై ఆకర్షితులైన మండలంలోని కలవకూరు గ్రామంలోని 50 వడియరాజుల కుటుంబ సభ్యులు టీడీపీ పార్టీని వీడి ఆదివారం కోట వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి హనిమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలవకూరు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు, సిబ్బంది

- సెర్చ్‌లో 184 మద్యం బాటిళ్లు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

చీరాల: జిల్లాలో ఎక్కడైన అసాంఘిక కార్యకలాపాలు చేస్తే చట్ట ప్రకారం శిక్షలు తప్పవు.. అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే జైలుకెళ్లక తప్పదని డీఎస్పీ ప్రసాదరావు హెచ్చరించారు. ఆదివారం ఆదివారం పట్టణంలోని దండుబాట ప్రాంతంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచనల మేరకు సబ్‌డివిజన్ పోలీసులతో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెర్చ్‌లో ఒన్‌టౌన్ సీఐ పి.శేషగిరిరావు, సబ్ డివిజన్‌లోని ఎస్సైలు జనార్ధన్, జ్యోతి, శ్రీనివాసరావు, సాల్మన్ రాజ్‌లతో పాటుగా 70 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దండుబాటలో నివాసం ఉంటున్న వారి వివరాలతో పాటుగా వారు వినియోగిస్తున్న వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. దండుబాటలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వారి వద్ద నుంచి 184 క్వార్టర్ సీసాలు, 1 ఫుల్‌బాటిల్ మద్యంతో పాటుగా సరైన పత్రాలులేని 10 వాహనాలు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు చేసిన, మద్యం, సారాయి అమ్మకాలు అక్రమంగా చేస్తే చర్యలు తప్పవన్నారు. జనావాసాల మధ్యం మద్యం, సారాయి అమ్మకాలు చేస్తున్న వారి సమాచారాన్ని అందించి ప్రజలు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అక్రమ వ్యాపారాలు చేసే వారి వివరాలను 100 లేదా 83338 13228 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వారానికి రెండు సార్లు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామన్నారు. దాడుల్లో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉన్నారు.



మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న సీఐ శేషగిరిరావు

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పృథ్వీ, శివానీ

వేటపాలెం: మండల పరిధిలోని పాపాయిపాలెం ఎంపీయూపీ హైస్కూల్‌లో చీరాల ప్రాణహిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, క్యాన్సర్ సెంటర్ వారిచే ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ గడ్డం పృథ్వీ, డాక్టర్ శివాణి చావరాల వైద్య శిబిరానికి వచ్చిన 240 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్ల వాతం, పక్షవాతం, ఊపిరితిత్తులకు సంబంధించిన వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరులో హనుమాన్ చాలీసా



చాలీసా పఠనం చేస్తున్న భక్తులు

జే.పంగులూరు: అయోధ్యలో రాముల వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పంగులూరు వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో ఆదివారం హనుమాన్ చాలీసా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అవధూత భక్త మండలి వారిచే 108 సార్లు హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. భక్తులు ఆలయంలో ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా లెనిన్ శతవర్ధంతి వేడుకలు



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మార్టూరు: కమ్యూనిజం వ్యవస్థాప ముఖ్య నాయకుడు వ్లాడిమర్ ఉలియనిచ్ లెనిన్ 100వ వర్ధంతి వేడుకలు ఆదివారం మార్టూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక గన్నవరం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు మహమ్మద్ బాషా, ఇతర నాయకులు, సుజాత, బొల్లాపల్లి బెంజిమెన్, విజయ్, వలీఖాన్, బాబు, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

గానాల రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం



చీరాలలో రామ్మూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు



మేదరమెట్లలో రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు



మార్టూరులో నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

మేదరమెట్ల: మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ గానాల రామ్మూర్తి జయంతి వేడుకలను కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజనీ బ్రహ్మేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ఏర్పాటు చేశారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం జరిగిందని అందుకు ప్రతి ఒక్కరం ఆయనకు రుణపడి ఉంటామన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరం సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ డైరక్టర్ దంపతులను సన్మానించారు. సామంతపూడి సుబ్బారావు, పొన్నపల్లి బ్రహ్మానందం, సుధాకర్, రావూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: మాజీ ఎమ్మెల్సీ గానాల రామమూర్తి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం చీరాల నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం, చీరాల పేరాల పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గానాల రామ్మూర్తి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కడలి జగదీష్‌కుమార్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మలు పాల్గొన్నారు. గౌరవాధ్యక్షుడు రామోజు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఇంకొల్లు వీరభద్రుడు, కోశాధికారి ఆదిమూలం ప్రభాకరరావు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: స్థానిక అమ్మ ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో రామ్మూర్తి చిత్రపటానికి బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ పావులూరి హనుమంతరావు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు మచ్చా అనంతాచారి, చందు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: గానాల రామ్మూర్తి జయంతి వేడుకలను ఆదివారం స్థానిక బ్రహ్మంగారి దేవస్థానంలో అద్దంకి విశ్వబ్రాహ్మణ మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షురాలు కొలకలూరి భారతీ దేవి, కమిటీ సభ్యులు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైభవంగా రాములోరి శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

వేటపాలెం: అణుమల్లిపేటలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద నుంచి ఆయోధ్య రాములవారి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాముల వారి శోభాయాత్ర ఆదివారం వైభవంగా నిర్వహించారు. శోభాయాత్ర దేవస్థానం నుంచి బయలు దేరి సంతరావూరు రోడ్డు మీదుగా గడియారస్తంభం సెంటర్ మీదుగా అత్యంత వైభవంగా తిరిగి దేవస్థానానికి చేరుకుంది. గ్రామంలో ప్రజలు స్వామి వారికి హారతులు ఇచ్చి పూజలు చేశారు. జైశ్రీరాం.. నినాదాలతో వీధులు మారుమోగాయి. పురుషులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి శోభాయాత్ర వెంట నడిచారు. కార్యక్రమాన్ని విశ్వహిందు పరిషత్ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పరిషత్ కన్వీనర్ కోడూరు తరణ్, గొల్లపూడి సీతారామ్, కంజుల మహేష్, హర్షవర్ధన్ రెడ్డి, రామిశెట్టి చైతన్య, ప్రతి వెంకట సుబ్బారావు, పొన్నూరి రమేష్, శ్రీరామ్ గోవర్ధన్, ఊటుకూరి శ్రీను, చుండూరి రమేష్ పాల్గొన్నారు.



శోభాయాత్రలో ఊరేగుతున్న శ్రీరామచంద్రుడు

రాజీలేని రాడికల్ హ్యూమనిస్ట్ వెంకటాద్రి

ఇంకొల్లు (చినగంజాం): రాజీలేని రాడికల్ హ్యూమనిస్ట్‌గా రావిపూడి వెంకటాద్రి తన జీవిత కాలాన్ని కొనసాగించిన గొప్ప వ్యక్తి అని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు కుర్రా హనుమంతరావు అన్నారు. ప్రముఖ హ్యూమనిస్ట్ రావిపూడి వెంకటాద్రి ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ స్థానిక రాడికల్ సమావేశం భవనంలో ఆదివారం రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ అధ్యక్షుడు మేడూరి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆసంఘ ట్రెజరర్ షేక్ బాబు మాట్లాడుతూ రావిపూడి సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీరితో పాటు సమావేశంలో ఏపీ హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, ట్రెజరర్ కరణం రవీంద్రబాబు, పూర్వ అధ్యక్షుడు చుంచుశేషయ్య, సహాయ కార్యదర్శి సింహాద్రి యలమందారెడ్డి, హ్యూమనిస్ట్ సెంటర్ ప్రధాన కార్యదర్శి కరి హరిబాబు, రావిపూడి మనుమరాలు చెరుకూరి భారతి, అమరావతి హేతు వాద సంఘం కార్యదర్శి కళ్యాణం చంద్రశేఖర్ తదితరులు రావిపూడి గురించి ప్రసంగించారు. తాటి సుబ్బారావు, బీరం సుందరరావు, శ్రీనివాసరావు, సీహెచ్ కోటేశ్వరరావు, మేడూరి లక్ష్మీనారాయమ, రావి నాగేశ్వరి తదితరులు ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటాద్రి బంధువులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న రాడికల్స్ నాయకులు

బాల్యదశ నుంచే సత్ప్రవర్తనతో మెలగాలి

చినగంజాం: సండే స్కూల్ విద్యార్థులు బాల్యదశ నుంచే ఆధ్యాత్మిక చింతన కలిగి సత్ప్రవర్తనతో మెలగాలని చినగంజాం అంబేద్కర్ నగర్ సండే స్కూల్ నిర్వాహకులు మేకల మేషక్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ నగర్‌లోని పెద్ద చర్చి వద్ద ప్రార్థన దినోత్సవం పురస్కరించుకొని సండే స్కూల్ విద్యార్థులతో సమావేశం అయ్యారు. సండే స్కూల్ పిల్లలకు బెంగళూరులో సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న చినగంజాం అంబేద్కర్ నగర్‌కు చెందిన సలగల శ్రీనివాసరావు, గోపి, శ్రీ వాణి దంపతులు వారి సొంత నిధులతో బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన సర్వే



కులగణన పర్యవేక్షిస్తున్న సచివాలయ సిబ్బంది

బల్లికురవ: ప్రభుత్వం ఇంటింటా చేపట్టిన కులగణనను సమర్థవంతంగా లోపాలు తలెత్తకుండా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య ఆదివారం కోరారు. 2డీ సచివాలయాల పరిధిలో కులగణన జరుగుతున్నట్లు చెప్పారు. సచివాలయంలో పని చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగుల పర్యవేక్షణలో వలంటీర్లు ఇంటింటా సర్వే చేస్తున్నారన్నారు. సర్వే టీంకు ప్రజలు సహకరిస్తూ 17 అంశాలను యాప్‌లో అప్‌లోడ్ చేయించుకోవాలన్నారు. కులగణనతో ఈ గ్రామ డేటాను పూర్తిగా తెలుసుకోవచ్చని ఎంపీడీవో వివరించారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా క్రీడలు



బేస్తవారిపేట: క్రీడాకారులకు అభినందనలు తెలుపుతున్న ఎంపీడీఓ పార్వతి

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. క్రికెట్‌లో విన్నర్స్‌గా బేస్తవారిపేట, కబడ్డీ పురుషుల, మహిళల విభాగంలో జేసీ అగ్రహారం, ఖోఖో పురుషుల విభాగంలో బేస్తవారిపేట, మహిళల విభాగంలో పిటికాయగుళ్ల, బాల్ బ్యాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో బేస్తవారిపేట, మహిళల విభాగంలో పూసలపాడు జట్లు విన్నర్స్‌గా నిలిచినట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లను ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ, ఎంఈఓలు అభినందించారు.